సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం ၊ 23 ၊ జూన్ ၊ 2025



టీడీపీలో కులాల కుంపటి.!

వర్గ విభేదాలకు నిలయమైన రాజంపేట టీడీపీలో అధికారాపెత్తనం కోసం కులాల కుంపటి రాజుకుంటోంది. ఇన్‌చార్జి కుర్చీకోసం నాయకులు సిగపట్లు పడుతున్నారు. -8లో



భర్త మరణాన్ని మరువక ముందే భూమి ఆక్రమణ

విద్యుత్ షాక్‌తో భర్తను కోల్పోయి తేరుకోక ముందే వితంతువు భూమిని ఓ కుటుంబం ఆక్రమించడం మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1516 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 23వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గంగమ్మకు బోనాల సమర్పణ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా లక్కిరెడ్డి పల్లె మండల పరిధిలోని అనంతపురంలో గంగమ్మ ఆలయం విరాజిల్లుతోంది. ఆదివారం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంగమ్మా ..కరుణ చూపు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు.కొందరు బోనాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిపించి పంటలు బాగా పండేలా దీవించమ్మా అంటూ రైతులు వేడుకున్నారు. పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

27 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

మదనపల్లె సిటీ: కేరళలోని కొజికోడ్‌లో జూన్ 27 నుంచి 30 వరకు ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలు జరగనున్నాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి అన్నారు. ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్స్‌ను స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 50లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థిసంఘంగా ఎస్ఎఫ్ఐ ఉందన్నారు. అందరికీ విద్య, ఉపాధి, శాస్త్రీయ విద్యావిధానం కోసం ఉద్యమిస్తోందన్నారు. నూతన జాతీయ విద్యావిధానంతో ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేస్తూ నీరుగార్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం కష్టతరంగా ఉందన్నారు. కొఠారి కమిషన్ పేర్కొన్న విధంగా జీడీపీ 6శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యుడు జయబాబు, సమీర్, నాయకులు శ్రీధర్‌నాయక్, తరుణ్‌కుమార్, హర్షవర్ధన్, కార్తీక్, యశ్వంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 155 మంది హాజరు



పత్రాలను పరిశీలించుకున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం రెండవ రోజు ఆదివారం కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 15001వ ర్యాంకు నుంచి 32 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకుని తమకు సంబంధించి ధృవపత్రాలను పరిశీలించుకున్నారు. రెండవ రోజు కౌన్సెలింగ్‌కు 155 మంది అభ్యర్థులు హాజరై తమ ధృవ పత్రాలను పరిశీలించుకున్నారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, ఛీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ దామోదర్, వెరిఫికేషన్ ఆఫీసర్లు అనిత, బాగ్యశ్రీ, రేణుకా, రాజేష్ పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

సోమవారం నిర్వహించబోయే కౌన్సెలింగ్ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 32000 నుంచి 50 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

యువత ఆశలపై నీలినీడలు

- యువకులను నిట్టనిలువునా ముంచిన కూటమి సర్కార్
- నిరుద్యోగులకు భృతి లేదు... ఉపాధి కానరాదు
- పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిన రీయింబర్స్‌మెంట్
- ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న చిరుద్యోగుల తొలగింపు
- నేడు రాయచోటి కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్ సీపీ యువత పోరు



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ నిరుద్యోగులను గాలికి వదిలేసింది. అధికారంలోకి రాకముందు ఒకటేమిటి? అది చేస్తాం, ఇది చేస్తామంటూ బురిడీ కొట్టించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు...అదీ లేకపోతే నిరుద్యోగ భృతి, చదువుకునే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా ఎన్నో చెప్పి చివరకు సూపర్ సిక్స్ లేకపోగా, మిగతావి అమలు కూడా చేయకుండా మాయమాటలతో ముందుకు సాగుతోంది. ఇప్పుడే కాదు...గతంలో 2014లో కూడా హామీలిచ్చి అధికారంలోకి రాగానే కూటమి సర్కార్ ప్రజలకు ఎగనామం పెట్టింది. అయితే 2019 వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకవైపు పరిశ్రమలు, మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి, ఇంకోవైపు చదువులకు వైఎస్సార్ విద్యాదీవెన, వసతి దీవెన ఎప్పటికప్పుడు త్రైమాసికంలోనే నిధులను అందిస్తూ అన్ని విధాలా ఆదుకుంటూ వచ్చారు. కూటమి సర్కార్ ప్రతి జనవరిలోనే జాబ్ క్యాలెండర్ అన్నా దాని గురించి పట్టించుకునే పరిస్థితి లేదు. ఏడాది దాటినా విద్యార్థులు, నిరుద్యోగ యువతను పట్టించుకోని నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సోమవారం పోరుబాటకు సంకల్పించింది.

చదువుకేదీ భరోసా

వైఎస్సార్ సీపీ హయాంలో చదువులకు భరోసా ఉండేది. ఇంజినీర్ కావాలన్నా...డాక్టర్ కోర్సు చేయాలన్నా...ఇతర పెద్ద చదువులకు చదవాలన్నా ప్రోత్సాహం అందించింది. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ విద్యా దీవెన కింద 1,50,934 మందికి సుమారు రూ. 378.75 కోట్లు అందించారు. అంతే కాకుండా వైఎస్సార్ వసతి దీవెన కింద కూడా రూ. 1,28,290 మందికి రూ. 150.33 కోట్ల సొమ్మును అందించారు. పేద విద్యార్థుల చదువుకు వైఎస్ జగన్ సర్కార్ భరోసా కల్పిస్తూ వచ్చింది. ఎప్పటికప్పుడు కళాశాలల ఫీజు విషయంలో ఒత్తిళ్లు చేయకుండానే సకాలంలో అందించడంతో విద్యార్థుల చదువులు సాఫీగా సాగిపోయాయి. ప్రస్తుత కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వసతి, విద్యా దీవెన పథకాలకు నిధులు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు ఫీజుల ఒత్తిడి మొదలైంది.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

జిల్లాలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు లేక, ప్రైవేటు జాబులు దొరకక అవస్థలు తప్పడం లేదు. డిగ్రీ, పీజీ,ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, బీఈడీ తదితర కోర్సులు చేసిన వారు నిరుద్యోగులుగా మారుతున్నారు. ప్రస్తుత కూటమి సర్కార్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాది దాటింది. కొత్త పరిశ్రమల జాడ జిల్లాలో లేకపోగా, నిరుద్యోగులకు ఉద్యోగాలకల్పన మాటలకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. జిల్లాలో సుమారు 2,45,000కు పైగా యువత, నిరుద్యోగులు ఉన్నారు. ఉపాధి కోసం ఎక్కడా చిన్నపాటి అవకాశాలు దొరికినా పెద్దపెద్ద చదువులు చదివిన వారు కూడా దరఖాస్తులు చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటివరకు డీఎస్సీకి నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. మిగతా అనేక శాఖల్లో ఖాళీలు ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదు.

చిరుద్యోగుల మెడపై కత్తి

కూటమి సర్కార్ కొత్త ఉద్యోగాలపై దృష్టి పెట్టకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడ గొడుతున్నారు. మంగంపేట ఏపీఎండీసీలో పనిచేస్తున్న సుమారు 100 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. మరోవైపు కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ వర్కర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు ఇలా చెబుతూపోతే అనేక చిన్నపాటి ఉద్యోగులను తొలగించి వారికి ఆకలి వేదన మిగిల్చారు.

బాబూ...ఏదీ భృతి

ఎన్నికలకు ముందు ఊరూరా ఊదరగొట్టి....మేనిఫెస్టోలో పెట్టడమే కాకుండా ప్రతి ఇంటికి ఉద్యోగం లేదా భృతి అంటూ చెప్పిన మాటలు ఇప్పుడు మాయమాటలుగా కనిపిస్తున్నాయి. ఏడాది దాటినా ఇప్పటికీ నిరుద్యోగ భృతి జాడలేదు. ప్రతి ఒక్కరికీ భృతి కింద రూ. 3 వేలు అందిస్తామన్నా అసలు పథకం గురించే ప్రభుత్వం మరిచిపోయింది. ఉద్యోగాలు లేక అనేక మంది నిరుద్యోగులు కనీసం ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాట ప్రకారం భృతి అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడిచిపోవడంతో ఒక్కొక్కరికి రూ. 3 వేలు చొప్పున 12 నెలలకు రూ. 36 వేలు బకాయిలుగా వారు అభివర్ణిస్తున్నారు.

యువత పోరుకు భారీగా తరలి రండి



వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన, విద్యార్థి విభాగాల పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునిచ్చారు. కూటమి సర్కార్ పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలచేయకపోవడం, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోకపోవడం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించకపోవడం, ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టి అనంతరం వినతిపత్రాన్ని సమర్పించనున్నారు. కార్యక్రమానికి విజయవంతానికి ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ నేతలు పోస్టర్లను ఆవిష్కరించారు. యువత పోరుకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలనిపార్టీ నేతలు పిలుపునిచ్చారు.

రెడ్డెమ్మతల్లీ.. కరుణించమ్మా..



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు జరిపారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా పేరు పొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు.కొందరు భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. హిందువులతో పాటు ముస్లీమ్‌లు పెద్ద ఎత్తున ఆలయానికి తరలిరావడం విశేషం.

ప్రశాంతంగా బదిలీ ప్రక్రియ

కడప ఎడ్యుకేషన్: కడపలోని డీఈఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 1998,2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 901 ఖాళీలను ప్రదర్శించగా జిల్లాలో ఉన్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు తమకు సంబంధించిన స్థానాలకు కోరుకుని బదిలీపై వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా 206 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకుగాను 201 మంది బదిలీ కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. మిగతా ఐదు మంది అభ్యర్థులకు బదిలీ కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు.

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన బాబు

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



బాలరాసజపల్లె గ్రామంలో పర్యటిస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్: చంద్రబాబునాయుడు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాడని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని బాలరాసపల్లె గ్రామంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర పేరుతో మూడు వందల కోట్లకు పైగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నా, రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. యోగాంధ్రకు చేసిన ఖర్చుతో అనేక ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేవన్నారు. చంద్రబాబు నాయుడు పాలన పచ్చ పత్రికల్లో తప్ప మరెక్కడా కనిపించడం లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదయినా ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోగా ఎన్నికల హామీలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఏడాది కాకముందే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. జగన్ ఎక్కడ పర్యటించినా ప్రజలు వేలాదిగా తరలి రావడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రజల్లో జగన్‌కు ఉన్న స్పందన చూస్తే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ఒక్క సీటు కూడా సాధించలేవన్నారు. వైఎస్సార్ సీపీకి 175కు 175 సీట్లు వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

- నందలూరుకు చెందిన రిటర్డ్ రైల్వే డాక్టర్ భాస్కర్ కుమారుడు ధీరజ్‌కుమార్ గత సివిల్స్ ఫలితాల్లో ర్యాంకు సాధించి మహారాష్ట్రలో ఎస్పీగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆదివారం ఆయనను ఎస్టేట్‌కు ఆహ్వానించి సత్కరించారు. నందలూరుకు చెందిన పలువురు ఐఏఎస్‌లు అయ్యారని, ఇప్పుడు ధీరజ్‌కుమార్ ఐపీఎస్ కావడం ఎంతో గర్వకారణమని తెలిపారు.

చేతనైతే ఉద్యోగాలు ఇవ్వండి.. కడుపుకొట్టకండి

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

రైల్వేకోడూరు అర్బన్: సీఎం చంద్రబాబు చేతనైతే ఉద్యోగాలు ఇవ్వాలని, తమపై కోపంతో ప్రతిపక్ష నాయకులను ఎదుర్కోలేక తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రూ. 20 వేలు రూ. 30 వేలు సంపాదించుకునే ఉద్యోగుల కడుపుకొట్టొద్దని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీకార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ సంస్థల్లో యువకులకు తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు కల్పిస్తే తమపై కోపంతో వాటిని పీకేసి వారి కుటుంబాలు రోడ్డున పడేటట్లు చేసిన పాపం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్, మంత్రి లోకేష్‌లదేనని పేర్కొన్నారు. ఏపీఎండీసీలో తీసేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు,లోకేష్‌లు 25లక్షల మందికి ఉద్యోగాలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు ఉడగొడుతూ యువకులకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వేంటనే 2 లక్షల మందికి పైగా యువకులకు వివిధ రకాల ఉద్యోగావకాశాలు కల్పించారని, ప్రజలకు సంక్షేమం అందించారని గుర్తు చేశారు. ఏపీఎండీసీలో స్థానికతకు ప్రాధాన్యం ఇస్తూ ఇక్కడి చదువుకొన్న యువతకు మేము ఉద్యోగాలు ఇస్తే చంద్రబాబు రాగానే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దారుణమని తెలిపారు.అధికారం, ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా చేస్తే ఉద్యోగులు, యువతలో అభద్రతా భావం ఏర్పడుతుందని తెలిపారు. రాజకీయాల్లో నాయకత్వం వహించే నాయకులు ఆదర్శంగా ఉండాలన్నారు. తమపై రాజకీయ కక్షసాధింపులో భాగంగా యువకులకు అన్యాయం చేయడం సబబు కాదన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా ఉండి న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు తమపనులు చేసుకొంటున్నారని, ఇలా చిరుద్యోగులపై కక్ష సాధింపు సరి కాదన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్‌రమేష్, వెలగచర్లశివారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, పంజం సందీప్‌రెడ్డి, తల్లెంభరత్‌కుమార్‌రెడ్డి, అన్వర్‌బాషా, హరికృష్ణ, మార్సెల్లరాజేశ్వరి, బండారుమల్లి, గల్లాశ్రీనివాసలు, ఆర్వీరమణ, డమ్ము రఘు, డీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నిధులు..ఆగిన పనులు

- కూటమి సర్కార్ నిర్వాకం
- జమ కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- రెండు నెలలు కిందటే జిల్లాకు రూ. 20.78 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- పంచాయతీలకు అందక కుంటుపడిన అభివృద్ధి



చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని గ్రామ సచివాలయం భవనం

రాయచోటి: నేతి బీరకాయలో నెయ్యి ఉండదన్న చందంగా కూటమి పాలనలో గ్రామీణ పాలన సాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. పల్లె సీమల అభివృద్ధి కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాటలు కూడా నీటి మూటలయ్యాయి. కూటమి సర్కార్ పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు చేరలేదు. దీంతో అభివృద్ధి కుంటుబడింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జనాభా ప్రాతిపదికన కేంద్రం ఏటా ఆర్థిక సంఘం రెండు విడతలుగా నిధులు మంజూరు చేస్తుంది. టైడ్, బేసిక్ నిధుల రూపంలో విడుదల చేసే వీటిని ఆర్థిక సంఘం నిబంధనల మేరకు స్థానిక సంస్థలు వినియోగించాలి. బేసిక్ గ్రాంట్‌ను గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటిక అభివృద్ధి, వీధిలైట్ల నిర్వహణ తదితర వాటికి వ్యయం చేయాల్సి ఉంది. టైడ్ గ్రాంటును పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఓడీఎఫ్ అమలు తదితర ప్రాథమిక అవసరాలకు ఖర్చు చేయాలి. కేంద్రం నుంచి ఈ నిధులు తొలుత రాష్ట్ర ప్రభుత్వానికి చేరుతాయి. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిబంధనల మేరకు పంచాయతీలకు జమ చేస్తుంది.

నెలలు గడుస్తున్నా ..

జిల్లాలో 30 మండలాల్లో 501 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నుంచి దాదాపు రూ. 28 కోట్ల మేర కేంద్రం కేటాయింపు చేసింది. తొలి విడతగా రూ. 7.88 కోట్లను అక్టోబర్ నెలలో విడుదల చేసింది. ఈ ఏడాది ప్రారంభంలో సుమారు రూ. 20.78 కోట్లను 15వ ఫైనాన్స్ కమిషన్ జిల్లాకు కేటాయించింది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసిపోయినా నెలల తరబడి ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది.

మండలాల వారీగా మంజూరైన నిధులు...

బి కొత్తకోట రూ. 4.41 లక్షలు, చిన్నమండెం రూ. 3.64 లక్షలు, చిట్వేలి రూ. 6.09 లక్షలు, గాలివీడు రూ. 9.74 లక్షలు, గుర్రంకొండ రూ. 4.32 లక్షలు, కలకడ రూ. 4.13 లక్షలు, కలికిరి రూ. 9.38 లక్షలు, కుంభంవారిపల్లి రూ. 7.36 లక్షలు,కోడూరు రూ. 15.14 లక్షలు, కురబలకోట రూ. 5.73 లక్షలు, లక్కిరెడ్డిపల్లి రూ. 5.57 లక్షలు, మదనపల్లి రూ. 6.39 లక్షలు, ములకలచెరువు రూ. 7.70 లక్షలు, నందలూరు. రూ. 6.10 లక్షలు, నిమ్మనపల్లి రూ. 5.38 లక్షలు, ఓబులవారిపల్లి రూ. 9.63 లక్షలు, పెద్దమండెం రూ. 6.12 లక్షలు, పెనగలూరు రూ. 1.16 కోట్లు, పీలేరు రూ. 7.35 లక్షలు, పిటీఎం రూ. 80.26 లక్షలు, పుల్లంపేట రూ. 56.89 లక్షలు, రాజంపేట రూ. 1.18 కోట్లు, రామాపురం రూ. 60.15 లక్షలు, రామసముద్రం రూ. 69.42 లక్షలు, రాయచోటి రూ. 50.95 లక్షలు, సంబేపల్లి రూ. 44.53 లక్షలు, టి సుండుపల్లి రూ. 64.16 లక్షలు, తంబళ్లపల్లి రూ. 72.29 లక్షలు, వాల్మీకిపురం రూ. 58 లక్షలు, వీరబల్లి రూ. 59.22 లక్షలు.

పడకేసిన ప్రగతి...

నిధుల విడుదలలో జాప్యం కావడంతో గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఇంటి పన్నులపై వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణకు కూడా చాలని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్భాటంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు బిల్లులు ఇవ్వకపోవడంతో మిగిలిన పనులు మధ్యలో ఆగిపోయాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో నిధులు రావన్న ఉద్దేశంతో సిమెంట్ రోడ్ల నిర్మాణం ఆగిపోవడంతో స్థానికులు అదే రోడ్లపై ప్రయాణం సాగిస్తున్నారు. డ్రైజీనే వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. నిధుల కొరతతో అనేక గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నిధుల కొరత వేధిస్తోందని సర్పంచ్‌లు వాపోతున్నారు. రెండో విడత నిధులు మండలాలవారీగా కేటాయింపులు జరిగాయని, త్వరలోనే విడుదల కావాల్సి ఉందని జిల్లా పంచాయతీ అధికారిణి రాధిక తెలిపారు.గ్రామాల అభివృద్ధి కోసం ఏవేవో చేస్తామంటూ ఎన్నికల ముందు వాగ్దానాలు ఇచ్చి, ఉపన్యాసాలు చేసిన నాయకుల క్లాదుటే నిధులు దారి మళ్లిపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. 15వ ఫైనాన్స్ రెండో విడత నిధులను పంచాయతీలు కేటాయించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటి: సైబర్ మోసగాళ్ల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారి వలలో పడరాదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల ద్వారా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఉండటానికి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ వివరించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఏపీకే ఫైల్స్, జీమెయిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. లాటరీ తగిలిందని, బహుమతులు వచ్చాయని చెప్పే మోసపూరిత సందేశాలను నమ్మవద్దని కోరారు. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సురక్షితమైన వెబ్ సైట్‌లను మాత్రమే ఉపయోగించాలని ఎస్పీ నొక్కి చెప్పారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగినట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలను నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో దుప్పి మాంసం విక్రయిస్తున్న కొనిరెడ్డి రామసుబ్బారెడ్డి అనే వ్యక్తిని ఆదివారం అటవీశాఖ అధికారి శ్యామసుందర్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

భర్తపై గొడ్డలితో దాడి



గాయపడిన మోహన్ నాయక్

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాదం చోటుచేసుకుని భర్తపై భార్య గొడ్డలితో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తట్టివారిపల్లె పంచాయతీ టిడ్కో ఇళ్ల వద్ద నివాసం ఉంటున్న మోహన్ నాయక్(45) తన భార్య శారదతో కుటుంబ అవసరాల కోసం ఉంచిన నగదు ఖర్చు విషయమై వివాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో గొడ్డలి తీసుకుని శారద భర్త మోహన్ నాయక్‌పై దాడిచేసింది. దాడిలో మోహన్‌నాయక్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

మదనపల్లె రూరల్ : మద్యం తాగేందుకు భార్య నగదు ఇవ్వకపోవడంతో భర్త దాడిచేసిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. నెమలినగర్ వడ్డిపల్లెలో భార్యాభర్తలు మోహన్, గాయత్రి నివాసం ఉంటున్నారు. మోహన్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. అందులో భాగంగా ఆదివారం తనవద్ద మద్యం సేవించేందుకు డబ్బు లేకపోవడంతో భార్య గాయత్రిని అడిగాడు. ఆమె తనవద్ద లేదని సమాధానం ఇవ్వడంతో ఆవేశానికి లోనై ఇటుక రాళ్లతో ఆమెపై దాడి చేశాడు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

పొలంలో తెగి పడిన కాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లికి చెందిన బైరెడ్డి (38) అనే రైతు కాలు ప్రమాదవశాత్తు తెగిపడింది. వివరాలిలా.. ఆదివారం రోటివేటర్‌తో పొలాన్ని చదును చేసే క్రమంలో వదులుగా ఉన్న రోటివేటర్ బోల్ట్‌లను బిగించే ప్రయత్నం చేస్తుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు దూసుకుపోయింది. దీంతో బోల్ట్‌లు బిగిస్తున్న బైరెడ్డి కాలు మోకాలి వరకు తెగిపోయింది. గ్రామస్తులు వెంటనే 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

మిథున్‌రెడ్డి, ఆకేపాటి భేటీ



ఆకేపాటితో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలు ఆదివారం భేటీ అయ్యారు. పట్టణ శివార్లలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎంపీ, ఎమ్మెల్యే సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనువాసులు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు చొప్పా ఎల్లారెడ్డి, పుల్లంపేట, రాజంపేట, నందలూరుకు చెందిన నేతలు పాల్గొన్నారు.

టీడీపీలో కులాల కుంపటి.!

- ఇన్‌చార్జి కుర్చీకోసం బలిజల సిగపట్లు
- బలిజేతర నేతలపై అధిష్టానం దృష్టి ?
- తాజాగా తెరపైకి కడపకు చెందిన బలిజ నేత



రాజంపేట : వర్గ విభేదాలకు నిలయమైన రాజంపేట తెలుగుదేశం పార్టీలో అధికారాపెత్తనం కోసం కులాల కుంపటి రాజుకుంటోంది. ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలోని తోట కళ్యాణ మండపంలో నియోజకవర్గ వ్యాప్తంగా బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశం ప్రధానంగా టీడీపీలో బలిజలకు అన్యాయం జరిగిందనే విధంగా కొనసాగినట్లుగా అధిష్టానానికి నివేదికలు వెళ్లినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నియోజకవర్గంలోని రాజంపేట టౌన్, రాజంపేట రూరల్, నందలూరు, ఒంటిమిట్ట, సుండుపల్లె, వీరబల్లి మండలాలకు చెందిన బలిజ సామాజికవర్గానికి చెందిన గ్రామ, మండల స్థాయి నేతలు తరలి వచ్చారు. 500 మంది వచ్చినట్లుగా లెక్కలు వేసుకుంటున్నారు. అయితే టీడీపీకి చెందిన బలిజ సామాజిక వర్గంలో పేరొందిన సీనియర్లు, ముఖ్యనేతలు పాల్గొనకపోవడం గమనార్హం.

ఇన్‌చార్జి పదవి తమకే ఇవ్వాలనే అల్టిమేటం..

టీడీపీ ఇన్‌చార్జి పదవి తమకే ఇవ్వాలనే అల్టిమేటం ఆత్మీయ సమావేశం ద్వారా అధిష్టానానికి ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇప్పటికే టీడీపీలో పసుపులేటి బ్రహ్మయ్య, బత్యాల చెంగల్రాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం లాంటి బలిజ నేతలకు అన్యాయం జరిగిందనే భావన సమావేశంలో నేతలు వ్యక్తం చేసుకున్నారు. సమావేశంలో కడపలో ఉంటున్న హరిప్రసాద్, మోదుగల కళావతమ్మ ఇంజినీరింగ్ కళాశాల అధినేత పెంచలయ్య సోదరులు, కుప్పాల వెంకటసుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది కృష్ణకుమార్, బండారు బాలయ్య, పూల భాస్కర్, వెంకటసుబ్బయ్యతోపాటు వివిధ మండలాలకు చెందిన బలిజ నేతలు, రాజంపేట పట్టణానికి చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా టీడీపీ ఇన్‌చార్జి పదవి హరిప్రసాద్‌కు ఇవ్వాలనే డిమాండ్ పరోక్షంగా బలిజనేతలు తెరపైకి తీసుకొచ్చారు. ఈయన కడపకే పరిమితమైన నాయకుడిగా చెలామణి అవుతున్నా ఇప్పుడు తాను ఒంటిమిట్ట మండలానికి చెందిన వ్యక్తిననే భావనతో ఇన్‌చార్జి రేసులోకి వచ్చారు.

బలిజలకు అధిష్టానం అనుకూలమా.. ప్రతికూలమా..

టీడీపీ ఇన్‌చార్జి పదవి బలిజేతరుల నేతలకు ఇవ్వడానికి అధిష్టానం దృష్టి సారించినట్లుగా పార్టీ వర్గాల్లోనే ప్రచారం జరుగుతోంది. అందువల్లనే బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు తరచూ ఆత్మీయ సమావేశాలు పెట్టుకొని టీడీపీ కుర్చీని దక్కించుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుకూలమా, ప్రతికూలమా అనేది ఇంకా బహిర్గతం కాలేదు. ప్రస్తుతానికి ఇన్‌చార్జిని ప్రకటించే విషయంలో అధిష్టానం వెనకడుగుపై అనేక ఆలోచనలు, అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

బలిజేతరుల వైపు చూపు..!

ఇప్పటికే క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన, రాజు విద్యాసంస్థల అధినేత చమర్తి జగన్‌మోహన్‌రాజు, రెడ్డి సామాజికవర్గం నుంచి మేడా విజయశేఖర్‌రెడ్డిలు ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, రాయచోటికి చెందిన సుగవాసి బాలసుబ్రమణ్యంను అధిష్టానం గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేయించింది. వారి ఓటమి తర్వాత ఆ సామాజికవర్గం దిశగా ఇప్పుడు అధిష్టానం ఆలోచన చేయడం లేదన్న వాదన పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. కానీ బలిజలు రాజంపేట తమదే.. టీడీపీ కుర్చీ తమకే అన్నట్లుగా భీష్మించుకొని కూర్చున్నారు. అధిష్టానం ఎటువైపు మొగ్గుచూపుతుందో వేచి చూడాల్సిందే.



బలిజల ఆత్మీయ సమావేశం వేదికపై బలిజ నేతలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన లక్ష్మీనరసమ్మ





రామసముద్రం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణమ్మ, శ్రీనివాసులు

ఇద్దరికి తీవ్ర గాయాలు

రామసముద్రం : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన రామసముద్రం మండలంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ దిగువపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ(65), కృష్ణమ్మ, శ్రీనివాసులు ద్విచక్రవాహనంలో సమీప గ్రామమైన పనసమానుకుంటలో రామకోటి కార్యక్రమానికి బయలు దేరారు. చెంబకూరు–మదనపల్లి రోడ్డు మార్గంలోని బలిజపల్లి క్రాస్ వద్ద మదనపల్లి నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గరికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే క్షతగ్రాత్రులను మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మీనరసమ్మ మృతి చెందింది. కాగా కృష్ణమ్మ తలకు, భుజానికి తీవ్ర గాయాలు కాగా శ్రీనివాసులు కాలు విరిగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీనివాసులును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. కృష్ణమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఆదివారం మదనపల్లి రూరల్ సీఐ సత్యనారాయణ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో కురుబలకు ప్రాధాన్యత ఇవ్వాలి



కురుబ యువత కమిటీకి నియామక పత్రాలు అందిస్తున్న ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మదనపల్లె రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నామినేటెడ్ పదవుల్లో కురుబ కులానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు కోరారు. ఆదివారం మదనపల్లె మండలం టిడ్కో గృహాల సమీపంలోని గాయత్రి పార్క్‌లో ఏపీ కురుబ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కురుబ కుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలు, కురుబ సంఘం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ యువత, మహిళా, ఉద్యోగుల కమిటీ ఏర్పాటు, తిరుపతిలో కనకదాస విగ్రహం ఏర్పాటు, ఆవిష్కరణ, కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయింపు విషయమై ప్రభుత్వ పెద్దలను కలవడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో భాగంగా కురుబ యువత కమిటీని ప్రకటించారు. సత్యసాయిజిల్లా కురుబ యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొంగటి రమేష్, అనంతపురం జిల్లా రాష్ట్ర కురుబ యువత జాయింట్ సెక్రటరీగా చెలిమి గురుమూర్తి, ఉపాధ్యక్షులుగా కప్పల జమదగ్ని, సత్యసాయిజిల్లా రాష్ట్ర కురబ యువత కార్యదర్శి కొంక నాగార్జున, కురుబ యువత ఉపాధ్యక్షులు బ్యాల్ల పార్థసారధి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కప్పల సుదర్శన్, గౌరవ అధ్యక్షులుగా ఆర్.రాజశేఖర్, కార్యదర్శిగా కె.నాగభూషణకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ కురుబ సంఘం జనరల్ సెక్రటరీ వి.లింగమూర్తి, ట్రెజరర్ సి.విఠల్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్లు కె.నాగేశ్వరరావు, కె.రెడ్డికుమార్, సెక్రటరీ వి.వెంకటరమణ, కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగుతుండగా మంటలు అంటుకుని గాయాలు

మదనపల్లె రూరల్ : స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్న ఓ వ్యక్తికి మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పీలేరుకు చెందిన గిరి(32) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. రాత్రి పట్టణంలోని కదిరిరోడ్డులో ఉన్న ఓ మద్యం దుకాణంలో స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు కూర్చున్నాడు. ఈ క్రమంలో సిగరెట్ వెలిగించేందుకు ప్రయత్నించగా, అగ్గిరవ్వలు పక్కనే ఉన్న మద్యం గ్లాసులో పడటంతో అంటుకుని మంటలు చెలరేగాయి. గిరి శరీరంపై మంటలు వ్యాపించడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి



మృతి చెందిన రవీంద్ర

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లి సమీపంలో ఆదివారం ఆగి ఉన్న ద్విచక్రవాహనదారుడిని మరో వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా.. కమ్మవారిపల్లికి చెందిన రవీంద్ర (62) తన ద్విచక్రవాహనం నిలిచిపోవడంతో వాహనాన్ని పక్కన నిలిపి పెట్రోల్ ఉందో లేదోనని గమనిస్తుండగా వెనుక నుంచి వచ్చిన టాటా ఏస్ గూడ్స్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రవీంద్ర తలకు బలమైన రక్త గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా బి.కొత్తకోట సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ప్రేమికుడి మోసంతో యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : ఏడేళ్లుగా సహజీవనం చేసిన ప్రేమికుడు, పెళ్లికి ముఖం చాటేయడంతో యువతి ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. గాంధీపురానికి చెందిన ఓ యువతి (20) పట్టణంలోని గొల్లపల్లెకు చెందిన అంజప్ప కుమారుడు మహేంద్ర ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. సహజీవనం చేశారు. యువతి తల్లి, భర్తతో విడిపోయి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. ఆమె తన కుమార్తె పోషణ కోసం పంపిన డబ్బులు సైతం యువతి ప్రేమికుడికే అందించింది. ఆరునెలల క్రితం యువతి తల్లి కువైట్ నుంచి వచ్చి కుమార్తెకు వివాహం జరిపేందుకు ప్రయత్నించగా, ప్రేమికుడు కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని నిరాకరించాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అతిథి గృహమా.. అధికార పార్టీ కార్యాలయమా!



అన్నమయ్య అతిథి గృహం వద్ద టీడీపీ నేతల భేటీ దృశ్యం

రాజంపేట : రాజంపేటలోని అన్నమయ్య అతిథి గృహం (రహదారులు, భవనాల శాఖ, రాజంపేట) కాస్తా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల తెలుగు తమ్ముళ్ల భేటీ, అత్యవసర సమావేశాలతోపాటు పలు పార్టీ కార్యక్రమాలు అన్నమయ్య అతిథి గృహం నుంచే జరిగిపోతున్నాయి. తాజాగా ఆదివారం కూడా టీడీపీ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించుకున్నారు. అతిథి గృహం వద్ద టీడీపీ నేతల సమావేశాలు, నేతల భేటీలతో రద్దీగా ఉండటంతో అధికారులు అతిథి గృహం వైపు రావాలంటే వెనకడుగు వేస్తున్నారు.

పట్టపగలు ఇంటిలో చోరీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో విజయదుర్గా కాలనీ సమీపంలో రామాంజనేయపురంలో నివాసముంటున్న లక్ష్మీదేవి అనే మహిళ ఆదివారం చికెన్ కోసం ఇంటికి తాళం వేసి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేలోపు తాళం పగలగొట్టి ఇంటిలో 10 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుని వెళ్లారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి

మైలవరం : మండల పరిధిలోని ధన్నవాడ గ్రామంలో జొన్న పంటకు నీరు కట్టేందుకు మోటార్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రాసిబోయిన రమణయ్య(42) అనే రైతు మృతి చెందాడు. భార్య దస్తగిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రైతు ఆదివారం మొక్క జొన్న పంటకు నీరు కట్టేందుకు వెళ్లాడు. అయితే విద్యుత్ తీగలు బయటికి వచ్చి ఉండటాన్ని గమనించలేదు. అవి కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

మహిళ అదృశ్యం

జమ్మలమడుగు : మైలవరం మండలం బుచ్చంపల్లి పంచాయతీ మురపంది గ్రామానికి చెందిన మూడే తేజేశ్వరి అదృశ్యమైంది. ఈమేరకు భర్త మూడే కేశాలు నాయక్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్యామసుందర్‌రెడ్డి తెలిపారు.

తండ్రిపై కుమారుడి ఫిర్యాదు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో కాగితాలపెంట సమీపంలో నివాసముంటున్న నిజాం, ఫర్హానాల కుమారుడు హసీం తన తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లి మూడు నెలల క్రితం మృతి చెందిందని, అప్పటినుంచి తండ్రి తనను పట్టించుకోలేదని, తన మేనమామ వద్దనే ఉంటున్నానని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రైతుపై కత్తులతో దాడి

ముద్దనూరు : మండలంలోని సోంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులు మూలె లక్ష్మిరెడ్డి అనే రైతుపై కత్తులతో దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.4లక్షల10వేల నగదును దోచుకుని పరారయ్యారు. బాధితుని సమాచారం మేరకు లక్ష్మిరెడ్డి మామిడికాయల వ్యాపారం నిమిత్తం బెంగళూరు వెళ్లి అక్కడ మామిడికాయల మండి నుంచి రూ.4లక్షల10వేల నగదు తీసుకుని హిందూపురం వరకు రైలులో ప్రయాణించాడు. హిందూపురం నుంచి మోటార్ బైకులో స్వగ్రామం సోంపల్లెకు బయలుదేరాడు. లక్ష్మిరెడ్డి సోంపల్లె వద్దకు చేరుకోగానే నలుగురు దుండగులు అతని బైక్‌ను ఆపి కత్తులతో దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిరెడ్డి వద్ద ఉన్న సొమ్మును దోచుకుని పారిపోయారు. త

భర్త మరణాన్ని మరువక ముందే భూమి ఆక్రమణ

- న్యాయం చేయకపోతే సామూహిక ఆత్మహత్యే శరణ్యం
- ఉన్నతాధికారులకు బాధితురాలి ఫిర్యాదు



అంగళ్లులో ఆక్రమిత భూమి వద్ద అత్త, బిడ్డలతో నిరసన తెలుపుతున్న బాధితురాలు శకుంతల

కురబలకోట : విద్యుత్ షాక్‌తో భర్తను కోల్పోయి తేరుకోక మునుపే వితంతువు భూమిని ఓ కుటుంబం ఆక్రమించడం మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది. కురబలకోట మండలం అంగళ్లులో ఈ దుస్సంఘటన జరగడం కలవరాన్ని కల్గిస్తోంది. మనో వేదనలో ఉన్న వితంతువు భూమిని ఆక్రమించి ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేయడం పట్ల అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వయో వృద్ధురాలైన అత్త, మరో వైపు చిన్నబిడ్డలతో ఉన్న ఆమె ఈ దుర్మార్గంపై కన్నీటి పర్యంతమవుతున్నారు. భూ ఆక్రమణపై బాధితురాలు గాండ్లపెంట శకుంతల ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన యువరైతు గాండ్లపెంట రెడ్డెప్పరెడ్డి (38) ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న అతని ఆకస్మిక మృతితో ఆ కుటుంబం ఇంకా కోలుకోలేదు. ఈ క్రమంలో అంగళ్లులో కడప మార్గంలో హైవే పక్కన ఉన్న ఆమెకు చెందిన 92 సెంట్ల భూమిపై మండలంలోని తుమ్మచెట్లపల్లెకు చెందిన ఓ కుటుంబం కన్నేసి ఆక్రమించిందని బాధితురాలు శకుంతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లిటిగేషన్ డాక్యుమెంట్ సృష్టించి అధికార పార్టీ అండతో భూ ఆక్రమణకు పాల్పడ్డారని వేదన పడుతోంది. ఏళ్లుగా వంశ పారంపర్యంగా ఆధీనంలో వున్న భూమికి న్యాయం చేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడతామని ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ఆక్రమిత భూమి వద్ద బాధితురాలు అత్త బిడ్డలతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. భర్త ఉన్నప్పుడు భూమి వైపు కన్నెత్తి చూడలేదు. అతను చనిపోయాక దౌర్జన్యంగా భూ ఆక్రమణకు పాల్పడి చుట్టూ ఫెన్సింగ్‌లా రాళ్లు నాటారని తెలిపారు. ఏళ్లుగా ఆధీనంలో ఉంటూ భూ హక్కు పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసు బుక్కులు కూడా ఉన్న తమ భూమిని ఆక్రమించడం ఏమిటని బాధితురాలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై అధికారులను విచారించగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

ఇటుకల బట్టీకి చెరువు మట్టి

చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు



గుంతలవాని చెరువు నుంచి ఇటుకల బట్టీ ఆవరణకు తరలించి డంప్ చేసిన మట్టి

కలికిరి : చెరువుల్లో మట్టి తరలింపునకు ఇరిగేషన్ శాఖ అధికారులు అధికారికంగా అనుమతులిస్తున్నారు. సాధారణంగా రైతులు తమ పొలాలకు మట్టి అవసరమై ఇరిగేషన్ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుని తగిన భూమి ఆధారాలు, ఇరిగేషన్ శాఖకు నామమాత్రపు రుసుము చెల్లించాలి. దీంతో ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత చెరువు నుంచి పొలానికి అవసరమైన మట్టిని తరలించుకోవడానికి అనుమతులు జారీ చేయాలి. ఇలాగే మండలంలోని పల్లవోలు గ్రామంలో గడికి చెందిన కొందరు రైతులు తమ పొలాలకు మట్టి అవసరమని సంబంధిత రికార్డులతో సహా ఇరిగేషన్ శాఖ అధికారులకు గడి సమీపంలోని గుంతలవానిచెరువు నుంచి మట్టి తరలించడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎలాంటి క్షేత్ర స్థాయి పరిశీలనలు చేపట్టని అధికారులు ఏకపక్షంగా ఒక రైతుకు మాత్రమే అనుమతి ఉత్తర్వులు జారీ చేసి, మిగిలిన రైతులను నిత్యం కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. రాజకీయ అండదండలుంటేనే మట్టి తరలింపునకు అనుమతులు ఇస్తామని స్వయంగా ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతుండటంతో గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన వ్యక్తి మాత్రం పొలానికి కాకుండా ఇటుకల వ్యాపార నిమిత్తం బట్టీకి మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా తరలించుకుంటున్నాడు. ఇదేమని అడిగిన రైతులపై తనకు అనుమతులున్నాయని చెబుతున్నాడు. దీనిపై ఇరిగేషన్ శాఖ మండల ఇన్‌చార్జి జేఈ గోపీక్రిష్ణను వివరణ కోరగా రైతుకు పొలానికి మట్టి తరలించడానికి అనుమతి ఇచ్చామని, ఇటుకల బట్టీకి మట్టి తరలిస్తుండటం తమ దృష్టికి రాలేదన్నారు. బట్టీకి తరలింపుపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



మోడం నాగభూషణంను సన్మానిస్తున్న గాలివీటి విజయభాస్కర్ రెడ్డి

వీరబల్లి : చేనేత కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడం నాగభూషణం కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జగనన్న ప్రభుత్వంలో ప్రతి చేనేత కార్మికుల ఖాతాలో సంవత్సరానికి రూ. 24 వేలు జమ చేసేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన మోడం నాగభూషణంను గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు నరేంద్ర నాయుడు, ఎల్లంపల్లి వార్డు మెంబర్ నాగభూషణం, మట్లి పంచాయతీ చేనేత కార్మికులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభం



101 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ నాగ కుళ్లాయప్ప



4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ సాయి చరణ్



86 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ మన్విత్ రెడ్డి



78 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ కారుణ్య ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆదివారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 89.2 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 399 పరుగులు చేసింది. ఆ జట్టులోని నాగ కుళ్లాయప్ప 182 బంతుల్లో 17 ఫోర్లతో 101 పరుగులు చేసి అద్భుతంగా ఆడారు. సాయి అర్థిత్ 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. ధనుష్ 2, తేజేష్ 2 వికెట్లు తీసుకున్నారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీసీ స్టేడియంలో..

అదే విధంగా వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి, ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 362 పరుగులు చేసింది. ఆ జట్టులోని మన్విత్‌రెడ్డి 87 బంతుల్లో 86, కారుణ్య ప్రసాద్ 78, చైతన్య తేజ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని రేవంత్ 2 వికెట్లు తీశాడు.

‘మైనార్టీ సంక్షేమం’లో నిధులను మింగేశారు

నిశ్శబ్దంగా ఉండే జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖలో అవినీతి బాంబు పేలింది. ఎవరూ ఊహించని విధంగా అక్రమాలు జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ శాఖను కాపాడాల్సిన అధికారే నిధులను మింగేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- రూ. 3.50 కోట్లకు పైగా గోల్‌మాల్
- సంచలనంగా మారిన అక్రమాలు
- అధికారుల విచారణ

కడప రూరల్ : జిల్లా మైనార్టీ సంక్షేమశాఖకు 2023లో డిప్యుటేషన్‌పై ఓ అధికారి వచ్చారు. ఆయన 2025 ఏప్రిల్ వరకు విధులను చేపట్టారు. ఏకంగా ఆయన ఆ శాఖకే కన్నం వేశారు. ఎంత అవినీతి జరిగింది స్పష్టంగా తెలియనప్పటికీ రూ. కోట్లలోనే కాజేసినట్లుగా తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.

అవినీతి జరిగిందిలా...

షాదీఖానాల నిర్మాణాలు, చర్చిల మరమ్మతులు తదితర సంబంధిత నిధులు జిల్లా కలెక్టర్ పేరుతో బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. అవినీతికి పాల్పడిన ఆ అధికారి జిల్లా కలెక్టర్ పేరుతో కొత్తగా అకౌంటు ఓపెన్ చేశారు. బ్యాంకులో ఉండే నిధులను సెల్ఫ్ చెక్కుల ద్వారా డ్రా చేశారు. అలాగే కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరి పేరు మీద కూడా చెక్కుల ద్వారా నిధులను డ్రా చేసుకున్నారు. అలా డ్రా చేసిన నిధులను పక్కదారి పట్టించారు. ఇలా దాదాపు రూ. 3.50 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయి.

వెలుగు చూసిందిలా

ప్రభుత్వం వివిధ శాఖల ఆర్థిక అంశాలకు సంబంధించి జమ, ఖర్చుల వివరాలను కోరుతోంది. ఆ మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖకు వివరాలు పంపాలని ఆదేశించారు. ఇక్కడి నుంచి ఆ శాఖ అధికారులు పంపిన వివరాల్లో తప్పులు ఉన్నట్లుగా ఉన్నతాధికారులు గమనించారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టరేట్‌కు పంపి ఆ శాఖలో ఫైళ్లను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో అక్కడ జరిగిన అవకతవకలు వెలుగుచూశాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో విచారణ సాగుతున్నట్లుగా తెలిసింది. ఈ అక్రమాలకు సంబంధించి అవినీతికి పాల్పడిన అధికారితోపాటు మరొక ఉద్యోగి అందుబాటులో లేనట్లుగా సమాచారం.